క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడివాడ టౌన్: రైల్వే పై ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణం కారణంగా గురువారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఎలక్ట్రికల్ ఈఈ జీవీ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓవర్ బ్రిడ్జ్ సమీపంలోని బ్యాంక్ కాలనీ, చౌదరిపేట తదితర ప్రాంతాల్లో ఈ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

చెరువును బాగు చేయించాలి



గుడ్లవల్లేరు: శేరీ దగ్గుమిల్లి శివారు తాడిచెర్లలోని పంచాయతీ చెరువును బాగు చేయించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి ఏఈ రూపేష్, గ్రామ కార్యదర్శి కరీమ్‌ను ఎంపీడీఓ టి.విజయసారథి ఆదేశించారు. తనకు వచ్చిన గ్రామస్తుల ఫిర్యాదుల మేరకు బుధవారం ఆయన పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ చెరువులో తూడు, నాచు పూర్తిగా పేరుకుపోయాయన్నారు. వెంటనే వాటిని తొలగించి, చెరువును బాగు చేయించాలని రూపేష్, కరీమ్‌ను ఎంపీడీఓ ఆదేశించారు.

ఫైర్ ఆఫీసర్‌కు ఘన సత్కారం



గుడివాడ టౌన్: గుడివాడ డివిజినల్ ఫైర్ ఆఫీసర్ ఆంజనేయులు సర్వీసులో ఇప్పటివరకు 30 ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్న సందర్భంగా బుధవారం అగ్నిమాపక శాఖ కార్యాలయంలో ఆయన్ను ఉద్యోగులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఫైర్ సిబ్బంది శ్రీనివాస్, వైఎల్ కుమార్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



గుడివాడ టౌన్: శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం ఏర్పాటు చేసిన 2025 క్యాలెండర్‌ను గుడివాడ ఆర్డీఓ జి.బాలసుబ్రహ్మణ్యం బుధవారం ఆవిష్కరించారు. ఆర్డీఓను ఆయన చాంబర్‌లో కలిసిన యాదవ సేవా సంఘం సభ్యులు తొలుత ఉత్తమ సేవా అవార్డు పొందిన సందర్భంగా ఆయనకు చిరు సత్కారం చేశారు. అనంతరం ఆయన చేతుల మీదుగా క్యాలెండర్ ఆవిష్కరించారు. సేవా సంఘం అధ్యక్షుడు పుట్టి హరికుమార్, సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి



పామర్రు: ప్రస్తుతం సైబర్ నేరాలు అధికమైన నేపథ్యంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని పామర్రు సీఐ సుభాకర్ పేర్కొన్నారు. స్థానిక ప్రసన్న జూనియర్ కళాశాల్లో విద్యార్థులకు సైబర్ క్రైమ్స్‌పై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ అపరిచితులతో ట్రాన్సాక్షన్ చేయవద్దన్నారు. ఓటీపీని ఎవరికీ చెప్పకూడదని తెలిపారు. అనవసరంగా క్యూ ఆర్ కోడ్‌లను స్కాన్ చేయవద్దన్నారు. ఉద్యోగాల కోసం ఎక్కడా డబ్బులు కట్టొద్దన్నారు. ఎస్ఐ రాజేంద్ర ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ సంగెపు వెంకట్రామయ్య పాల్గొన్నారు.

నాట్య కళాపీఠంలో మొక్కలు నాటిన అధికారులు



మొవ్వ: మండలంలోని కూచిపూడి శ్రీ సిద్దేంద్ర యోగి నాట్య కళాపీఠానికి పవర్ గ్రిడ్ అధికారులు అందజేసిన మొక్కలను బుధవారం కళాపీఠం ప్రాంగణంలో నాటారు. పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ సీనియర్ జనరల్ మేనేజర్ నాగమోహనరావు ఆధ్వర్యంలో కొబ్బరి, మామిడి తదితర ఫల సాయం ఇచ్చే 50 మొక్కలను నాటారు. కళాపీఠం వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చింతా రవి బాలకృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఏలేశ్వరపు శ్రీనివాసులు, టీచింగ్ అసిస్టెంట్ డాక్టర్ వేదాంతం వెంకటదుర్గాభవాని, హైస్కూల్ హెచ్ఎం సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యాలకు తూట్లు

- చెత్త కుప్పలు లేని సమాజం సాధ్యమా ?
- అలంకారప్రాయంగా చెత్త సంపద కేంద్రాలు



ముదినేపల్లి మండలం వడాలిలో నిరుపయోగంగా మారిన చెత్త సేకరణ కేంద్రం

కైకలూరు: ఒక అడుగు ముందుకు స్వచ్ఛత వైపు అంటూ ప్రభుత్వం పదే పదే చెబుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం స్వచ్ఛత అనేది 10 అడుగులు వెనక్కి మళ్లింది. ప్రతి నెలా మూడో శనివారం 'స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర' పేరుతో సీఎం చంద్రబాబునాయుడు వినూత్న కార్యక్రమాన్ని రూపొందించారు. క్షేత్ర స్థాయిలో రోజూ సేకరించే చెత్తను వేయడానికి డంపింగ్ స్థలాలు లేవు. పలు గ్రామాల్లో రహదారుల సమీపంలో చెత్త స్వాగతం పలుకుతోంది. తడి-పొడి చెత్తతో సంపద సృష్టించే కేంద్రాలు నియోజకవర్గంలో అలంకారప్రాయంగా మారాయి. గత ప్రభుత్వంలో అందించిన చెత్త సేకరణ రిక్షాలు మూలన పడి తుప్పుపట్టాయి.



కైకలూరు మండలం ఆటపాకలో తుప్పుపట్టి మూలన పడిన చెత్త సేకరణ రిక్షాలు

మండలాల వారీ డంపింగ్ యార్డులు

నియోజకవర్గంలో మండలాల వారీగా పరిశీలిస్తే కైకలూరు 26, కలిదిండి 23, మండవల్లి 29, ముదినేపల్లి 32 కలిపి మొత్తం 110 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో 89 పంచాయతీలకు డంపింగ్ యార్డు షెడ్లు ఉన్నాయి. 21 పంచాయతీలకు షెడ్లు లేవు. నియోజకవర్గం మొత్తం మీద రెండు, మూడు మినహాయించి అసలు చెత్త సేకరణ కేంద్రాలు పని చేయడం లేదు. కైకలూరులో సైతం డంపింగ్ యార్డు స్థలంపై వివాదం నెలకొంది. ముదినేపల్లి మండలంలో వడాలి-శ్రీహరిపురం మధ్య రహదారిపై చెత్త వేస్తున్నారు. వాడవల్లిలో మాత్రం వర్మికంపోస్టు తయారు చేస్తున్నారు. కలిదిండి మండలంలో మూలలంకలో రోడ్డు సమీపంలో చెత్త వేస్తున్నారు. మండవల్లి మండలంలో పెనుమాక లంక, నందిగామ లంక గ్రామాల్లో చెత్తను రోడ్డు సమీపంలో వేస్తున్నారు. మండవల్లి ఎంపీడీఓ ఆఫీసు సమీపంలో చెత్త సేకరణ కేంద్రం నిరుపయోగంగా మారింది.

వేధిస్తున్న నిధుల కొరత

చెత్త నుంచి సంపద కేంద్రాల నిర్మాణాలను ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాల్లో నిర్మించారు. ప్రతి 200 కుటుంబాలకు ఒక క్లాప్ మిత్రాను ఏర్పాటు చేశారు. కేంద్రం నుంచి రూ.3,000, రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ నుంచి రూ.3,000 వెరసి రూ.6,000 జీతంగా చెల్లించాలి. మొదట్లో నిధులు వచ్చినప్పటికీ కేంద్రం ఇటీవల రూ.3,000 నిలుపుదల చేసి, రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని చెప్పింది. ఆయా పంచాయతీల సెక్రటరీలు 15వ ఆర్థిక సంఘం నిధులు, పంచాయతీ నిధులు కలిపి ప్రస్తుత పరిస్థితుల్లో జీతం కింద రూ.10,000 పైబడి చెల్లించారు. చెత్త సేకరణ కేంద్రాలు పని చేయకపోవడంతో క్లాప్ మిత్రాల వ్యవస్థ నిర్వీర్యమైంది.

స్వచ్ఛ ఆంధ్ర సాకరమయ్యేనా?

ప్రతి నెలా మూడో శనివారం 'స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర' నిర్వహించాలని సీఎం చంద్రబాబు ఇటీవల గొప్పగా ప్రకటించారు. 100 శాతం తడి, పొడి చెత్తను వేరు చేయడం, ఘన వ్యర్థాలను 100 శాతం శాస్త్రీయంగా ప్రాసెస్ చేయడం, తిరిగి ఉపయోగించిన వ్యర్థాలను రీసైక్లింగ్ చేయడం, చెత్త కుప్పలు లేని సమాజాన్ని నిర్మించడం వంటి నిర్ణయాలు తీసుకున్నారు. ఇవన్నీ జరగాలంటే ముందుగా డంపింగ్ యార్డులు, షెడ్లు అందుబాటులోకి రావాలి. సరైన సిబ్బందిని నియమించుకుని జీతాలు చెల్లించాలి. అప్పుడు మాత్రమే స్వచ్ఛ ఆంధ్ర సాకరమవుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

చెత్తను రోడ్ల పక్కన పడేస్తున్నారు



రోజు వారి చెత్తను వేయడానికి అనేక గ్రామాల్లో డంపింగ్ యార్డులు లేవు. రోడ్ల పక్కనే చెత్తను పడేస్తున్నారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ స్థాయిలో చెత్త సేకరణ సిబ్బందిని పెంచాలి. చెత్త నుంచి సంపద కేంద్రాలను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలి.

– వి.రవి, లింగాల, గ్రామస్తుడు

కొల్లేరు నిబంధనలు అడ్డు



కొల్లేరు గ్రామాల్లో షెడ్లు నిర్మాణాలకు కొల్లేరు అభయారణ్య నిబంధనలు అడ్డు వస్తున్నాయి. దీంతో మణుగునూరు లంక వంటి కొల్లేరు గ్రామాల్లో షెడ్డు నిర్మించలేదు. అన్ని గ్రామాల్లో చెత్త సేకరణ షెడ్లు అందుబాటులో ఉన్నాయి. తడి, పొడి చెత్తపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం.

– కె.రామలింగేశ్వరరావు, ఎంపీడీఓ, మండవల్లి

రైతులు ఆందోళన చెందవద్దు

పమిడిముక్కల: ఎరువుల కొరతపై రైతులెవ్వరూ ఆందోళన చెందవద్దని, పంట దశను బట్టి అందుబాటులో ఉంచుతామని ఏఓ గణేష్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఈ రబీలో మొక్కజొన్న తదితర పంటలకు ఇప్పటివరకు మండలంలోని పీఏసీఎస్‌ల ద్వారా 200 మెట్రిక్ టన్నులు రైతులకు సరఫరా చేశామని పేర్కొన్నారు. వచ్చే వారం అన్ని పీఏసీఎస్‌లకు స్టాక్ వచ్చేవిధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రైతులు అవసరం లేకుండా అధిక మోతాదులో యూరియా వాడకూడదని పేర్కొన్నారు. మినుములో లద్దెపురుగు నివారణకు ఇమామ్యాక్టిన్ బెంజోయిట్ ఎకరానికి 80 గ్రాములు వాడాలని రైతులకు సూచించారు.

రోడ్డు భద్రతపై అవగాహన

గుడ్లవల్లేరు: రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గుడ్లవల్లేరు ఎస్ఐ ఎన్.వి.వి.సత్యనారాయణ తన సిబ్బందితో కలిసి బుధవారం బైక్ ర్యాలీని నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు.

రేపు అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం

గుడివాడ టౌన్: స్థానిక వాసవీచౌక్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం అమ్మవారి ఆత్మార్పణా దినోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ పాలక మండలి అధ్యక్షుడు జవ్వాజి గంగరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలు జయప్రదం చేయాలని కోరారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి

గుడివాడరూరల్: వాహనదారులు ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని గుడివాడ తాలూకా ఎస్ఐ ఎస్.చంటిబాబు కోరారు. మండలంలోని మల్లాయపాలెం పంచాయతీ పరిధిలోని రహదారుల వద్ద బుధవారం వాహనాల తనిఖీలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడకాన్ని తూచా తప్పకుండా పాటించాలన్నారు.

వ్యవసాయంతో పాటు పశుపోషణపై దృష్టి

పమిడిముక్కల: రైతులు వ్యవసాయంతో పాటు అనుబంధంగా పశుపోషణపై దృష్టి పెట్టి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని పశుసంవర్ధకశాఖ డీడీ, పశు ఆరోగ్య శిబిరాల ప్రత్యేక అధికారి పద్మ పేర్కొన్నారు. కపిలేశ్వరపురం పశువైద్యశాలలో ఏర్పాటు చేసిన పశు ఆరోగ్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. దూడలకు నట్టల నివారణ మందు వేశారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ మేలు జాతి పశువుల పెంపకం చేపట్టాలన్నారు. పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. వైద్య శిబిరంలో గర్భకోశ వ్యాధుల గుర్తింపు, చూడి పరీక్షలు చేశారు. గేదెలు, ఆవులు, లేగదూడలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ గుడివాడ డివిజన్ డీడీ శ్రీనివాసరావు, పామర్రు ఏడీ శశికుమార్, పశువైద్యులు ఎం.వెంకటేష్, ఎస్.ఈశ్వర్, కె.రాంనరేష్ పాల్గొన్నారు.

పశువులకు వైద్య పరీక్షలు

గుడ్లవల్లేరు: ఉచిత పశు వైద్య శిబిరాలతో పాడి రైతులకు ఎంతో ఉపయోగం ఉందని వెటర్నరీ వైద్యాధికారి డాక్టర్ వి.శ్రీవీణ అన్నారు. ఉలవలపూడిలో బుధవారం నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరంలో ఆమె పశువులకు వైద్య పరీక్షలు చేశారు. గ్రామ సర్పంచ్ పామర్తి కన్య భాస్కరరావు ఉచిత మందుల పంపిణీ చేశారు.



కపిలేశ్వరపురంలో దూడలకు నట్టల నివారణ మందు వేస్తున్న ప్రత్యేకాధికారి పద్మ

లేళ్లపూడిలో పశువైద్య శిబిరం

మండవల్లి: పశు వైద్య శిబిరాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని కానుకొల్లు పశు వైద్యుడు రామకృష్ణ అన్నారు. మండలంలోని లేళ్లపూడిలో బుధవారం పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గొర్రెలు, ఇతర పశువులకు ఏలిక పాముల నివారణ మందు వేశారు.

వాడవల్లిలో..

ముదినేపల్లి రూరల్ : వాడవల్లిలో బుధవారం పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రొద్దువాక డిస్పెన్సరీల పరిధిలో ఈనెల 21 నుంచి పశువైద్య శిబిరాలు ఏర్పాటుచేసి వైద్య పరీక్షలు చేస్తున్నారు. ఇందులో భాగంగా వాడవల్లిలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో వైద్యాధికారి రామకృష్ణ పశువులకు నట్టల నివారణ మందు వేశారు.

సమగ్ర సస్యరక్షణపై అవగాహన ఉండాలి

గుడివాడరూరల్: మినుము సాగులో వచ్చే తెగుళ్ల నివారణకు చేపట్టే సమగ్ర సస్య రక్షణ చర్యలపై రైతులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా వనరుల కేంద్రం అధికారి జ్యోతిరమణి అన్నారు. మండలంలోని దొండపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని మినుము సాగును బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెగుళ్ల నివారణకు సంబంధిత వ్యవసాయశాఖ అధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. వ్యవసాయశాఖ ఏడీఏ రమాదేవి, ఏఓ అనంతలక్ష్మి, వ్యవసాయశాఖ సిబ్బంది బి.పద్మజ, భవానీ పాల్గొన్నారు.

కనుమూరులో..

కనుమూరు(పామర్రు): మినుము సాగులో సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని పామర్రు ఏడీఏ బి.స్వర్ణలత పేర్కొన్నారు. మండలంలోని కురుమద్దాలి, కనుమూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రైతులు అగ్రి స్టాక్ సైట్‌లో ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. తద్వారా ఫార్మర్ ఐడీని పొందవచ్చన్నారు. సీతాఫలం తెగులు నివారణకు రెండు మిల్లీలీటర్ల డైమిథోయేట్‌ను ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఏఓ శివనాగరాణి పాల్గొన్నారు.



మినుము పైరును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

తలమాడు తెగులును నివారించండి

ముదినేపల్లి రూరల్: మినుము పైరులో వ్యాప్తి చెందే తలమాడు తెగులు అరికట్టేందుకు రైతులు చర్యలు తీసుకోవాలని మండవల్లి సబ్ డివిజన్ ఏడీఏ వెంకటమణి అన్నారు. మండలంలోని చిగురుకోట, దేవపూడిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన క్షేత్ర స్థాయి సమావేశాల్లో ఏడీఏ రైతులకు పలు సూచనలు చేశారు. ఏఓ వేణుమాధవ్ పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: మినుము సాగులో పొగాకు లద్దె పురుగు బెడద అధికంగా ఉందని, గుడ్లవల్లేరు ఏఓ ఎల్.సునీల్ నిర్ధారించారు. బుధవారం ఆయన కౌతవరంలో పొలంబడిని నిర్వహించారు. లద్దెపురుగా నివారణకు వేప సంబంధిత మందులను 1,500 పీపీఎం చొప్పున ఎకరానికి ఒక లీటరు నీటితో పిచికారీ చేసుకోవాలన్నారు. ఈ బెడద అధికంగా ఉన్నప్పుడు స్పైనోసాడ్ 60 మిల్లీలీటర్లు లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 80 గ్రాముల చొప్పున ఎకరానికి పిచికారీ చేయాలన్నారు. విస్తరణాధికారి యశ్వంత్ రాజా పాల్గొన్నారు.

ఒకటిన మండల పరిషత్ సమావేశం

పామర్రు: వచ్చే నెల ఒకటో తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు మండల పరిషత్ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.జ్యోతి బుధవారం తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షుడు దాసరి అశోక్‌కుమార్ అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

తప్పిపోయిన వ్యక్తిని తండ్రికి అప్పగింత



నందివాడ: మండలంలోని కుదరవల్లి గ్రామానికి చెందిన చెవిటి, మూగవాడైన గుండాబత్తిన తంబి అనే వ్యక్తి ఈ నెల 25వ తేదీన ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. తంబి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నందివాడ ఎస్ఐ మిస్సింగ్ కేసు నమోదు చేసి రెండు టీములను ఏర్పాటు చేసి వెతికించారు. మండవల్లి పరిసర ప్రాంతాల్లో తంబి తిరుగుతున్నట్లు సమాచారం వచ్చింది. అక్కడ పరిసర ప్రాంతాల్లో సిబ్బందితో వెతికించారు. గుడివాడ వైపు వెళ్తున్నాడని తెలిసింది. బుధవారం గుడివాడలో ఆటో డ్రైవర్ ఇచ్చిన సమాచారం మేరకు తంబిని పోలీసులు పట్టుకున్నారు. అనంతరం నందివాడ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి అతడి తండ్రికి అప్పగించారు.

నిదానంగా ప్రయాణించడమే శ్రేయస్కరం

డీఎస్పీ ధీరజ్ వినీల్

గుడివాడరూరల్: అతివేగం ప్రమాదాలకు కారణమని, నిదానంగా ప్రయాణించడమే శ్రేయస్కరమని గుడివాడ డీఎస్పీ వి.ధీరజ్ వినీల్ అన్నారు. లారీ ఓనర్స్ అండ్ ట్రాన్స్‌పోర్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు బుధవారం నిర్వహించారు. తొలుత రహదారి భద్రతపై ఆటోనగర్ లారీ స్టాండ్ నుంచి పట్టణంలో పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ లక్ష్యం కంటే ప్రాణం ముఖ్యమన్నారు. వాహనదారులు నిదానమే ప్రధానమనే ధ్యేయంతో వాహనాలను నడపాలన్నారు. గుడివాడ ఆర్టీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి లారీకి ఇన్సూరెన్స్, డ్రైవర్లకు లైసెన్స్‌తో పాటు భద్రతపై అవగాహన ఉండాలన్నారు.



అవగాహన ర్యాలీలో పాల్గొన్న డీఎస్పీ ధీరజ్ వినీల్, ఆర్టీఓ శ్రీనివాస్

కార్యక్రమంలో సీఐలు ఎస్ఎల్ఆర్ సోమేశ్వరరావు, కొండపల్లి శ్రీనివాసరావు, చిన్ని నాగప్రసాద్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సంగీతరావు, ట్రాఫిక్ ఎస్ఐ ప్రసాదరావు, లారీ ఓనర్స్ అండ్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.శ్రీనివాస్, కార్యదర్శి గోళ్ల శివ తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా మందుల దుకాణాల్లో తనిఖీ

కైకలూరు: ఆక్వా మందుల దుకాణాల్లో బుధవారం డ్రగ్స్ అధికారులు తనిఖీలు చేశారు. మండలంలోని భుజబలపట్నం, ఆటపాకలోని ఆక్వా మందుల దుకాణాల్లో టాస్క్‌ఫోర్సు బృందం తనిఖీ చేశారు. పలు దుకాణాల్లో కోస్టల్ ఆక్వా అథారిటీ అనుమతులు లేని మందులు, గడువు తీరినవి, అనుమతులు లేకుండా వెటర్నరీ మందుల విక్రయాలు వంటి సమస్యలను గుర్తించారు. ప్రతి ఆక్వా దుకాణం లైసెన్స్‌లు క్రమబద్ధీకరణ చేయించుకోవాలని అధికారులు సూచించారు. అనుమానం కలిగిన మందుల శాంపిల్స్‌ను పరీక్షలు నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. ఫలితాలు వచ్చిన తర్వాత సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏలూరు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అలీ, ఎంపెడా జేపీఓ దుర్గారావు, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి భవిత, ఏఎస్ఐ శ్రీనివాసరావు, వీఎఫ్ఏ రాజేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



భుజబలపట్నం ఆక్వా దుకాణంలో తనిఖీ చేస్తున్న టాస్క్‌పోర్సు బృందం

ప్రభుత్వ ఆస్పత్రిలో రోగుల అగచాట్లు

- డాక్టర్, సిబ్బంది లేక రోగుల తిరుగుముఖం
- గుడ్లవల్లేరు పీహెచ్‌సీలో ఓపీ తగ్గుముఖం

గుడ్లవల్లేరు: స్థానిక ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో రోగుల అగచాట్లు పడుతున్నారు. బుధవారం ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తే.. ఇక్కడున్న ఒక డాక్టర్ ట్రైనింగ్‌లో ఉన్నారు. మరొక ఇన్‌చార్జి డాక్టర్ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో ఉండటంతో వచ్చిన రోగులను పట్టించుకునే దిక్కే లేకుండా పోయింది. డాక్టర్, సిబ్బంది లేక రోగులు తిరుగుముఖం పడుతున్నారు. దీంతో నానాటికీ ఈ ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య తగ్గుముఖం పడుతోంది. ఈ పీహెచ్‌సీకి చెందిన డాక్టర్ యశస్విని ట్రైనింగ్‌లో ఉండటంతో ఆమె స్థానే ఇన్‌చార్జిగా గుడివాడ నుంచి డాక్టర్ అనురాధను నియమించారు. ఆమె కూడా బుధవారం అంగలూరు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో అక్కడ ఓపీ చూసే ప్రక్రియలో ఉన్నారు. ఇక్కడ పీహెచ్‌సీలో ఏ డాక్టర్ లేకపోవటంతో రోగులు పడిగాపులుగాశారు. ఉదయం 11 గంటలైనా.. డాక్టర్ రాక పోవటంతో రోగులు ఇంటి ముఖం పట్టారు.



ఓపీ రిజిస్ట్రేషన్ కౌంటర్ వద్ద డాక్టర్ కోసం రోగుల ఎదురుచూపులు



ప్రభుత్వ ఆస్పత్రి

ఇద్దరు డాక్టర్లు ఉండాలి

నిజానికి ప్రభుత్వ లెక్కల ప్రకారం ఈ పీహెచ్‌సీలో ఇద్దరు డాక్టర్లు ఉండాలి. గతంలో ఇక్కడ పని చేసిన డాక్టర్ నాయక్ విజయవాడకు బదిలీ అయ్యారు. ఇక్కడ ఒకే ఒక్క డాక్టర్ యశస్విని మాత్రమే ఇక్కడ పని చేస్తున్నారు. ఇప్పటికీ ఒక డాక్టర్ పోస్టు ఖాళీగానే ఉంది. పక్కనే ఉన్న గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఇటీవల ఓ బాలిక సిబ్బంది నిర్లక్ష్యంతో మృతిచెందినా కూడా ప్రభుత్వాన్ని కళ్లు తెరిపించటం లేదని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఈ ఆస్పత్రిలో డాక్టర్‌తో పాటు పీహెచ్ఓ, హెచ్‌వీ పోస్టులను భర్తీ చేయక పోవటంతో రోగులకు సరైన వైద్య సేవలు అందక ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయమై డాక్టర్ యశస్వినీని వివరణ కోరగా డాక్టర్ పోస్టు ఖాళీగా ఉన్న మాట వాస్తవమేనని తెలిపారు. అలాగే సిబ్బంది కొరత కూడా ఉందన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లామని పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు వీరే

కైకలూరు: కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులను పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం ప్రకటించారు. ఈ మేరకు ఉత్తర్వులు తాడేపల్లి కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి వెలువడ్డాయి. నియోజకవర్గ స్థాయిలో ముంద్రూ చార్లీస్ (యూత్ వింగ్), దున్నా బేబీ (మహిళా విభాగం), కొల్లాటి సత్యనారాయణ (రైతు విభాగం), పరింకాయల వెంకటేశ్వరరావు (బీసీ సెల్), ఉచ్చుల చినరాజు (ఎస్సీ సెల్), మహమ్మద్ గాలీబ్‌బాబు(మైనార్టీ సెల్), కూర్మా నెహేమియా (క్రిస్టియన్ మైనార్టీ సెల్), బోడిపోగు రాజేష్ (స్టూడెంట్ వింగ్), గుడివరాజ సత్య ప్రసాద్ (బాబి)(పంచాయతీరాజ్ వింగ్), బోయిన చంద్ర భోగేశ్వరరావు (ఆర్‌టీఐ వింగ్), రేగిశెట్టి రాము (వలంటీర్స్ వింగ్), గండికోట ఏసుబాబు(గ్రీవెన్స్ సెల్), రాచూరి మోహన్‌కుమార్ (వాణిజ్య విభాగం), తుమ్మలచర్ల ఏసు (వీవర్స్ వింగ్), సాక్షి సాయిబాబు (వైఎస్సార్ టీయూసీ), కుర్రేళ్ల మరియమ్మ (అంగన్‌వాడీ వింగ్), మండా నవీన్(సోషల్ మీడియా వింగ్), బొద్దుల శ్యామ్‌బాబు (శ్యామ్)(ఐటీ వింగ్), గోసాల రాజేష్ (దివ్యాంగుల విభాగం), మంగరాజు విజయ్‌కుమార్(డాక్టర్స్ వింగ్), పాము రవికుమార్ (పబ్లిసిటీ వింగ్), పండు ఆనంద్ రవిరాజు (మేధావుల ఫోరం), బొంతు యజ్ఞనారాయణ (బూత్ కమిటీలు) నియమితులయ్యారు.

ధార్మిక సేవలను ప్రోత్సహించండి

గుడివాడ టౌన్: దాతల ఆశయాలకు అనుగుణంగా ఏర్పాటు చేసిన ధార్మిక సంస్థలను ప్రోత్సహించాల్సిన బాధ్యత దాతలపై ఉందని టీడీపీ అధ్యక్షుడు రాంబాబు అన్నారు. బుధవారం స్థానిక ఘంటసాల నాగభూషణం వైశ్య అన్నదాన సత్రంలో 50 మంది పేదలకు ఒక్కొక్కరికి రూ. 2 వేలు చొప్పున, 200 మంది గర్భిణులకు రూ.1,000 చొప్పున పౌష్టికాహారం కోసం వితరణ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్రం పేరిట ఉన్న షాపులు, ఇతర మార్గాల్లో వచ్చిన ఆదాయాన్ని ఈ సేవా కార్యక్రమానికి వినియోగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ తనిఖీ అధికారి ఉయ్యూరు సుధాకర్, ఈఓలు కె.గోపాలరావు, వై శ్రీనివాస్, జి.శిరీష పాల్గొన్నారు.

అధికారకంగా ప్రకటించడం హర్షణీయం

కైకలూరు: వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారకంగా ప్రకటించడం హర్షణీయమని పలువురు ఆర్యవైశ్యులు పేర్కొన్నారు. కైకలూరులో రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ పీజేఎస్.మల్యాద్రి నివాసం వద్ద ఆర్యవైశ్యుల సమావేశం బుధవారం జరిగింది. ఈ నెల 31న పెనుగొండలో అమ్మవారి ఆలయానికి సీఎం చంద్రబాబు విచ్చేసి, పట్టు వస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారకంగా ప్రకటించడంపై వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు కేకే బాబు, పి.రాధాకృష్ణమూర్తి, గంగరాజు, చొప్పర్ల మురళి, చిట్టూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.